# గురుదక్షిణ

"మీరు నాకళ్లు తెరిచారు. ఎందరో సంస్కర్తలు నా దగ్గరికి వచ్చి గంటలకొద్దీ ధర్మపన్నాలు వల్లించారు. అవన్నీ ఒకచెవితో విని ఇంకోచెవితో వొదిలేసేదాన్ని. కాని, మీ కంఠంలో ఆవేశం, మీ మాటల్లో సత్యం నన్ను కూకటి వేళ్ళతో కదిలించినయ్. నా కుళ్లుబతుకుమీద నాకే రోత పుట్టింది. నాకు ముందుదారి ఏం చూపిస్తారు?" అని రమ అడిగింది.

"నీకే కోరికవుంటే దారిఅదే దొరుకుతుంది. దొరికి తీరుతుంది" అన్నాడు శర్మ గంభీరంగా. కాని, కథ ఇంతదాకా వస్తుందని అతను కలలోనైనా అనుకోలేదు. తనకే దారి దొరకక తన్నుకుంటున్నవాడు ఇంకొకరికి ఏం దారి చూపుతాడు? తనకీ జీవితంలో ఏంతెలుసునని? ఇన్నాళ్ళూ తను పుస్తకాల లోనే జీవితాన్ని చూచాడు. నవలల్లో, నాటకాల్లో, కథల్లో కనిపించే పాత్రల చిత్తవృత్తులే అతనికి తెలుసు. ప్రాణంతో నిండి తొణికేవ్యక్తులతో ఎల్లా మాట్లాడాలోకూడా శర్మకి తెలియదు. తను చెప్పిన సమాధానం తనకే తృప్తిగా లేదు. పధ్నాలుగోయేట వేశ్యగా జీవించటం మొదలుపెట్టిన రమ ఒక్కసారిగా ఇల్లా మారిపోతుందని శర్మ అనుకోలేదు.

శాస్త్రిఅనే స్నేహితుడి బలవంతంమీద శర్మ ఒకరోజున రమ యింటికి వెళ్ళాడు. వేశ్యల విలాసాలతో అతనికి వీసం కూడా పరిచయంలేదు. ఇన్ని కథలకి వస్తువుని అందించిన వేశ్య

అసలు ఎల్లావుంటుందో ఒకసారి చూసివద్దామని వెళ్ళాడు. గదిలో అడుగుపెట్టగానే రమ నవ్వుతూ ఆహ్వానించింది. చూపులతో ఏదో సైగలుచేసి శాస్త్రి చల్లగా జారుకున్నాడు. మెరుపుతీగలాగా వున్న రమ రూపలావణ్యం, విరితేనెలు చిందించే మాటలచాతుర్యం, కోకిలకు పాఠంనేర్పగల కంఠ మాధుర్యం శర్మదృష్టిని ఆకర్షించలేకపోయినయ్. ముళ్ళమీద కూచున్నట్లనిపించింది. ఉక్కపోసి ఒళ్ళంతా తడిసిపోయి ఊపి రాడకుండా వుంది. ఒక్కమాటైనా అతని నోటివెంట రావటం లేదు. ఠక్కున మనస్సులో దేవదాసు మెరిశాడు. జేబులో వున్న పర్సు పక్కమీద జారవిడిచి రమ పిలుస్తున్నా వెనక్కి తిరిగిచూడకుండా పరుగుతీశాడు.

"నిన్ను ఒక్కసారి తీసుకురమ్మని రమ నా ప్రాణం తీసే స్తోంది" అని మర్నాడు శాస్త్రివ స్తేనేకాని వీల్లేదని వేధించాడు. ఇష్టంలేకపోయినా ఏంజరుగుతుందో అని శర్మ వెళ్ళాడు. జమీందారులను సైతం కన్నెత్తిచూడని రమకి తనమీద ఇంత గురి కుదరడంచూసి శర్మ విస్తుపోయాడు. రమతో మాట్లాడు తుంటే ఏదో తెలియని మాధుర్యం శర్మహృదయాన్ని ఆవ రించేది. గంటలు క్షణాల్లాగా పరిగెత్తేవి. రోజు కొకసారి అయినా రమని చూడకపోతే తోచేదికాదు. తను చదివిన పుస్తకాల సారమంతా ఆమెకి అందించేవాడు. కనికట్టులో వున్న సర్పంలాగా చెవులప్పగించి శర్మమాటలు వింటూ అన్నీ మరిచిపోయేది రమ. ఈ దుర్గంధకూపంలోంచిబైటపడి ఉన్నత శిఖరాలకి ఎగబాకాలనే ఆరాటం రమలో కలిగింది. శర్మ

చెప్పే కథలువింటుంటే తను వాటిలో ఒకపాత్ర అయిపోదా మనిపించేది రమకి.

తనకి అనుభవంలేని అద్భుతవిషయాలను గురించి శర్మ మాట్లాడేస్తూ వుండేవాడు. ఒకరాత్రి రమ తన జీవితకథను చెబుతుంటే కన్నీళ్ళతో విన్నాడు. దిక్కులేని పసిగుడ్డుగా వున్నప్పుడు, కన్నతల్లి చేతులారా చంపలేక నదిఒడ్డున పారేసి పోయింది. ఆ పసిగుడ్డుని ఒకవేశ్య ఇంటికితెచ్చుకుని పెంచి పెద్దదాన్ని చేసింది. ఈడు రాగానే రమ అందచందాలకి మురిసి ఈ వృత్తిలోకి దింపింది. వృద్ధవేశ్యకి వయసుమళ్ళినా చీకూచింతా లేకుండా కాలం గడిచిపోతున్నది.

కాని, శర్మ ఆనాడు తనయింటికి వచ్చినదగ్గర్నుంచీ రమముందు ఒక కొత్తలోకం సాక్షాత్కరించింది. అతని మాటలు బంగారుబాటలై రమని ఎక్కడికో తెలియని దూర సీమలకి నడిపించుకుపోతున్నయ్. శర్మమటుకు ఆరోజు తను దేవదాసులాగా పట్నపడేసి రావటంమూలాన రమ ఇల్లా మారుతుందనీ కథ ఇల్లా సాగుతుందనీ తలపోయలేదు.

నిజంగా ఇవాళ రమవేసిన ప్రశ్న అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ముందుదారి తను రమకి ఏం చూపగలడు. తనే జీవితంలో దారంతెగిన గాలిపటం. భార్యకీ, తనకీ సరిపడక చివరికి విడిపోయి పదేళ్ళు కావొస్తోంది. భార్య గొప్పయింటి బిడ్డ. తను బీద బడిపంతులు. ఇల్లరికం వుంచుకోవాలని తన కిచ్చి పెళ్ళిచేశారు. కాని, అత్తవారింట పంజరంలో చిలక లాగా బతకలేక పారిపోయివచ్చాడు. తనతో వచ్చి ఇరుకు కొంపల్లో కాపురం చెయ్యటానికి భార్య ససేమిరా ఒప్పుకో

లేదు. అత్తవారి బంగళాలో బందీకావటానికి తనూ ఒప్పుకోలేదు. సంబంధం తెగిపోయింది. భార్యకి ఎవరితోనో సంబంధం వుందనికూడా శర్మ చెవిని పడింది. అంతటితో తలుపులు బిగుసుకుపోయినయ్. పోనీ రమను తను పెళ్ళిచేసుకుంటే? తన సిద్ధాంతాలకి కట్టుబడి ధైర్యంగా ఆమెని చేపట్టితే? వెయ్యి నాలుకలతో వెక్కిరించే లోకం వికృతంగా అతనికళ్ళముందు నిలబడింది. ఈ సాహసంవల్ల తనఉద్యోగం పోతే? ఊళ్ళో తన పలుకుబడి దిగజారిపోతే? తనమీద అంతా రాళ్ళు విసిరితే? అన్నిటినీ ఎదుర్కొన్నా చివరికి రమ తనని మోసగిస్తే? ఆకస్మికంగా రమలో వచ్చినమార్పు హఠాత్తుగా మాయమై ఎప్పటి ఆటకే దిగితే? తనగతి ఏంకాను? మనస్సులో ఒకటే దుమారం.

ఆలోచనల్లో సుడి తిరుగుతున్న శర్మ రమకంఠం విని త్రుళ్ళిపడ్డాడు. "అయితే నాకు దారిదొరుకుతుందంటారా? చెప్పండి?" అని రమ అతని పాదాలదగ్గర కూచుంది. మెత్తని వేళ్ళతో అతనిపాదాలు ఒత్తుదామని వొంగింది. "ఎందుకు దొరకదూ?" అంటూ లేచి వెళ్ళిపోయాడు శర్మ.

తెరిచిన ద్వారంలోంచి మబ్బుని చీల్చుకువచ్చే చంద్రబింబపు శోభనిచూస్తూ నిలబడిపోయింది రమ.

శర్మ వెళ్ళిపోయాక గదితలుపులు బిడాయించి పక్కమీద వాలింది. పాతవిటులు మూసిన తలుపులుదగ్గరే పడిగాపులు పడి తిట్టుకున్నారు. ముసలితల్లి కఠోరమైన తిట్లు పిడుగుల్లాగావినిపించినయ్. అయినా రమగదితలుపు తీయలేదు.

* * *

"మొత్తానికి భలేపనిచేశావు నిక్షేపరాయుడివి" అని అక్షింతలు వేస్తూనే శాస్త్రి గదిలో అడుగుపెట్టాడు.

"ఏమిటి, సంగతేమిటో చెప్పూ" అంటూ వెనక్కి తిరిగాడు శర్మ ఆశ్చర్యంతో.

"ఏమీ ఎరగనట్లు! ఎంత సంగనాచి వేషాలు వేస్తున్నావోయ్. ఇంతకీ ఆ ముసలిదాని నోట్లో మట్టికొట్టావు. రోజూ వెళ్ళి వస్తుంటే ఏమోలే అనుకున్నాను. ఇదా నువ్వు చేసిన ఘనకార్యం? ఇంతకీ రమని ఎక్కడికి పంపావో చెప్పు. చెప్తేకాని నేనిక్కణ్నుంచి కదల్ను" అని భైటీవేసుకుని కూచున్నాడు శాస్త్రి.

"ఏమయిందీ రమ? ఎక్కడి కెళ్ళిందీ? నాకేం తెలుసు అని బిత్తరపోయాడు శర్మ.

"ఈ దొంగ వేషాలు నాదగ్గర పనికిరావు. దాని బుర్రలో ఏవో పిచ్చి వూహాలు నూరిపోశావు. నీకు తెలియకుండా అది ఎక్కడి కెళుతుందీ? నిజం చెప్పు?" "ప్రమాణం చేసి చెబుతున్నాను. నాకు తెలియదు. నువ్వుచెప్పేదాకా నాకీ సంగతే తెలియదు." "అయితే చిత్రంగావుందే! తెల్లారేసరికీ పరారిఅయిపోయింది. ఎంతగాలించినా జాడ తెలియలేదు. బంగారంలాంటిదాన్ని ఎందుకూ కాకుండా చేశావు. ఇదంతా నువ్వు కట్టుకున్న పుణ్యమే!" అని పళ్ళు పటపట కొరుకుతూ వెళ్ళిపోయాడు శాస్త్రి.

శర్మకి తల తిరిగిపోయింది. రమ ఏమైపోయిందో? తనకి చూచాయగానైనా చెప్పకుండా ఎక్కడికి వెళ్ళిపోయింది? ఎలా కాలం వెళ్ళదీస్తున్నదో? ఇంతదాకా వస్తుందని తను

కలల్లోనైనా అనుకోలేదు. అసలు తనకి ఆమెతో పరిచయం కాకుండా వుంటేబాగుండేదేమో! ఆమెకి తన చుట్టూవున్న జీవితంమీద రోత కలిగించాడు. కాని, అందులోంచి బైట పడే దారి తను చూపలేక పోయాడు. రమ కూడా అందరి లాగే తల ఎత్తుకుని గౌరవంగా బతికే అవకాశం తను చూపించలేక పోయాడు. ఇంత సాహసానికి రమ పూను కుంటుందని తను ఎన్నడూ ఊహించలేదు. ఎక్కడైనా రమ ప్రాణంతో వుంటేచాలు, సుఖంగావుంటేచాలు అనిమనసులో పదే పదే ప్రార్థించాడు.

రోజులు తిరిగి పోతున్నయ్. ఇప్పుడు శర్మకి పుస్త కాలమీద బుద్ధినిలవటంలేదు. ఎదుట వున్నన్నాళ్లూ రమ విశాల మైన కళ్ళలోని మెరుపుని గురించీ, బాణాలాగా వంగిన కను బొమలని గురించీ, మహాశిల్పి దిద్దినట్లుగావుండే ఆమె ముక్కు తీరుని గురించీ, లేత మబ్బుసందునుంచి తొంగిచూసే చంద్ర కళలాగా గ్లాస్కో చీరెలోంచి మెరిసే ఆమె శరీరచ్ఛాయని గురించీ శర్మ నిమిషంకూడా ఆలోచించలేదు. కాని రమ కను మరుగైన క్షణంనుంచీ ఆమె రూపలావణ్యం శర్మ హృద యంలో జ్వాలలాగా వెలుగుతోంది. అనుక్షణమూ ఆమెని గురించే ఆలోచన.

రమ తన ఎదుట ఉన్నన్నాళ్లు ఆమెని ఒక సమస్యగా శర్మ పరిగణించాడు. ప్రాణం ఉన్న వ్యక్తిగా గుర్తించలేక పోయాడు. పుస్తకాల్లో ఒక పాత్రలాగే రమ అతన్ని ఆకర్షిం చింది. కాని, ఇవాళ రమ ఎక్కడుందో తెలియకపోయినా అహర్నిశలూ రమ కోసమే మనసు ఆల్లాడుతోంది. పుస్త

కాల పుటలలో జీవించే శర్మకి వాస్తవ జీవితంలో జటిలమైన అనుభవాలని, పరస్పర విరుద్ధమైన కోరికలనీ రమ కలిగించి వెళ్ళిపోయింది. ఆమెని ఆ దుర్గంధ కూపంలోంచి ఉద్ధరించాలని ఉత్సాహంలో శర్మ తన సంగతి మరచిపోయాడు. తనలో పుట్టలోని పాముల్లాగా ఎన్నికోరికలు నిద్రపోతున్నయ్యో అప్పుడు తెలుసుకోలేక పోయాడు.

మెత్తటి గులాబీ రేకులవంటి వేళ్ళతో రమ తన పాదాలు ఒత్తబోయినప్పుడు శర్మ ఎంతో బాధ పడ్డాడు. ఆమె తనని గొప్పవాడని ఆరాదిస్తున్నది. గురువుగా పూజిస్తున్నది. "నువ్వు పొరబడుతున్నావు. నేను అందరిలాంటివాణ్ణే" అనే మాటలు శర్మ కంఠందాకావచ్చి అక్కడే కొట్టుకున్నయ్ కాని పెగిలి రాలేదు.

ఇప్పుడు రమని గురించి తనకి వచ్చే వింత కలలు తలచుకుంటే శర్మ సిగ్గుతో మగ్గిపోయాడు. ఆమె సౌంద ర్యాన్ని ఆస్వాదించాలనే బలీయమైన కోరిక తనలో ఎక్కడో ఇన్నాళ్లూ దాగివుంది. ఆమెను పెళ్ళిచేసుకొనే ధైర్యం అప్పుడూ లేదు. ఇప్పుడూ లేదు. తనలో అణగివున్న ఈ పిపాస అనుక్షణమూ శర్మని ఒక జ్వాలలాగా దహించివేస్తోంది. ఆమెని ఉద్ధరిద్దామని బయలుదేరిన ఈ సంస్కర్తలోకూడా ఆమె అందాన్ని ఆశించిన విటుడు దాక్కున్నాడు. రమ ఎదుట ఉన్నన్నాళ్లూ శర్మ లోపల దాగిన రాక్షసుడు బైట పడలేదు.

ఏ స్త్రీ కనిపించినా ఆమెని రమతో పోల్చుకుంటాడు. ఏనాటికైనా రమ తనకి కనిపిస్తే, ఆమె జాడ తనకి తెలిస్తే

ఎంతదూరమైనా రెక్కలు కట్టుకుని వెళ్ళివాలుతాడు... ధైర్యంచేసి తను పెళ్ళిచేసుకుంటానంటే రమ తిరస్కరించ గలదా ? నిజానికి రమని సృష్టించింది తనే! తల చేతుల్తో రూపు రేఖలు తీర్చి దిద్దిన విగ్రహాన్నే శిల్పి ప్రేమించటంలో తప్పేముంది ?

ఆ రోజు బళ్ళోంచి గదికి వచ్చేసరికి కిటికీలోంచి ఉత్తరం పడేసి ఉంది. ఆత్రంగా కవరు తెరచి చదివాడు. మీ సోదరి రమ అని సంతకం ఉంది చివర. తన కొక దారి దొరికిందట. తనని ఒకసారివచ్చి దీవించి వెళ్ళమనిరాసింది. ఈ సంగతి రెండో కంటివాడికి తెలియ నివ్వద్దని వేడుకుంది.

ఉత్తరం చదివి శర్మ తల్లడిల్లి పోయాడు. తనలోలేని గొప్పతనాన్ని ఆపాదించి ఎంతగా తనని రమ ఆరాధిస్తున్నదో! పదునైన కత్తిగుండెల్లో గుచ్చినట్లనిపించింది. అనుకోకుండా కళ్ళు తెరిసినయ్. ఆనాడే ఏదో వంక మీద సెలవుపెట్టి శర్మ ఎవరికీ చెప్పకుండా రైలెక్కాడు.

ఆ పరిసరమే ఇంకో ప్రపంచంలాగాఉంది. కోకిల పాటలతో, పిట్టల అరుపులతో గింగురుమనే కొండల కోట గోడల్లాగా నాలుగు దిక్కులా కనిపిస్తున్నాయి. వాటి మధ్య ఒక చిన్న లోయ. వేపచెట్లూ, మామిడి చెట్లూ చక్కటి నీడలతో గొడుగులు పడుతున్నాయి. కొండల మీదినుంచి గంతులేసుకుంటూ చిన్న సెలయేరు లోయలో గుడిసెని పలకరిస్తూ పరుగెత్తుతోంది. అడవి మల్లెపూలు, పచ్చగన్నేరుపూలు, ఎర్రమందారాలు ఆకుపచ్చ గుబుర్లలోంచి తొంగి చూస్తు

న్నయ్. ఎంతో ప్రయాసపడి కాలినడకమీద అక్కడికి చేరుకో గలిగాడు శర్మ. బస్తీలో విలాసంగా జీవించిన రమ ఇటువంటి నిర్జనప్రదేశంలో ఎల్లా గడుపుతున్నదో కాలం? ఇక్కడికసలు ఎల్లా చేరుకోగలిగిందో అని శర్మకి ఆశ్చర్యం వేసింది.

కొండలమీద పచ్చిక మేస్తూ పశువులు మందలు మంద లుగా కనిపిస్తున్నాయి. దూరంనుంచి పశువుల్ని మేపుతూ కాపరులు వాయించే పిల్లనగ్రోవి పరిసరాన్ని ఝుల్లుమని పిస్తోంది, "ఏ వూరు బాబూ ?" అని ముసలిగొల్ల గొంగళి మడతల్లోంచి అడిగాడు. శర్మ తటపటాయించాడు. అతని వేషాన్ని ఎగాదిగాచూసి గొల్లవాడు "అమ్మగారి కోసమా ? బస్తీనుంచి వొచ్చింద్రా బాబూ. అల్లదుగో అక్కడే" అంటూ ఒక గుడిసెకేసి చూపించాడు.

శర్మ చకచకా సాగి ముంగిట్లో నిలబడి "రమా !" అని పిలిచాడు.

"ఎవరూ ? రండి లోపలికి దయచెయ్యండి" అంటూ ఎదురుగావచ్చి రమ ఆశ్చర్యంతో విప్పారినఆనందంతో వెలిగే కళ్ళతో, నెలవంకలాగా పెదిమలమీద మెరిసే చిరునవ్వుతో ఆహ్వానించింది.

శర్మకి నోటిమాట రాలేదు. బొమ్మలాగా నిలబడి పోయాడు. తమ గుడిసెలమధ్యకి తెల్లబట్టలు వేసుకున్న బస్తీ మనిషి రావటంచూసి లోయలోవుండే వాళ్ళందరూ ఏదో విడ్డూరాన్ని చూడడానికి వచ్చినట్లుగా రమ గుడిసెచుట్టూ గుమిగూడారు. "ఈ బాబుగారెవరుతల్లీ ?" అని ఇందాక దారి

చూపిన ముసలిగొల్ల అడిగాడు. "ఆయన నా గురువుగారు. నన్ను చూసిపోదామని వచ్చారు" అని రమ చెప్పగానే అక్కడ మూగినవాళ్ళంతా భక్తిగా చేతులుజోడించి దణ్ణాలు పెట్టారు. వాళ్ళలో ఇంతగా రమ ఎల్లా కలిసిపోయిందో, ఇంతటి ప్రాపకం ఎల్లా సంపాదించగలిగిందో శర్మకి అర్థం కాలేదు. ఈ అమాయకులంతా తనకేసి చేతులెత్తి నమస్కరిస్తుంటే శర్మకిసిగ్గుతో నేలలోకి అణగారిపోతున్నట్లనిపించింది. గురువు అనే బిరుదు మోయలేని బరువుగా అతన్ని కుంగతీసేస్తున్నది.

ఒకగ్లాసులో వేడిపాలు తెచ్చి "తీసుకోండి. ఇక్కడ ఇదే మా కాఫీ!" అంటూ అందించింది రమ.

"అయితే నువ్వుమానేశావా కాఫీ?" అని ఆశ్చర్యంగా అడిగాడు శర్మ.

"ఎప్పుడో మానేశాను" అంటుంటే ఆమె ముఖంలో కలతలేని కొలనులోగోచరించే ప్రశాంతి మెరిసింది. ముఖాన్ని తళుక్కున వెలిగించే ఆమె చిరునవ్వులో మునుపటి కులుకూ, వగలూ లేవు. ఏదో మాటలకందని ప్రశాంతమాధుర్యం ఆమె రూపంచుట్టూ పరివేషంలాగా మెరిసిపోతున్నది. కోడెతాచుని గుర్తుచేసే వాలుజడ బదులు మెడమీదికి వాదులుగా వేసుకున్న ముడికనిపిస్తోంది. మెళ్ళో నగలన్నిటికీ బదులుగా సన్నటి తులసిపూసలదండ. శర్మ తనకళ్ళని తను నమ్మలేకపోయాడు.

మునుపటిలాగా మాట్లాడలేకపోతున్నాడు. అడుగడుగునా ఏదో సంకోచం అడ్డుపడుతోంది. తనకీ, రమకీ మధ్య

"ఇక్కడికే ఇప్పుడే వస్తాను. ఆ కొండమీద ఒకగుడి వుంది. ఆ గుడిమంటపంలో ఒకయోగిని జపం చేసుకుంటూ వుంది. ఆవిడదగ్గర నేను ఉపదేశం పుచ్చుకున్నాను. ఆవిడకి ఈ పాలుఇచ్చి వస్తాను" అంటూ వెళ్ళిపోయింది రమ.

"ఉపదేశమా?" అంటూ చివాలున లేచికూచున్నాడు శర్మ. కొండ ఎక్కుతున్న రమరూపం కనిపిస్తూనే వుంది.

రమ గుమ్మందాటగానే "అమ్మగారూ! అమ్మాయికి తేలుకుట్టింది. మంత్రంవెయ్యండి" అంటూ కొందరు వచ్చారు. "పిల్లాడికి జ్వరం పేలిపోతోంది. ఏదైనా మాత్ర ఇస్తారా?" అంటూ ఇంకొందరు వచ్చారు.

ఇదంతా చూస్తుంటే శర్మకి ఏదో సినిమా చూస్తున్నట్లుగా తోచింది. తనే రమకళ్ళు తెరిచాడు. కాని, తను ఉన్న చోటే వొదిలేసి రమ తను అందుకోలేని శిఖరాలమీద నిలబడివున్నది! ఆమె హృదయంలో కాంతి, తనమనుసులో కారుచీకటి.

రమ తిరిగిరాకముందే అక్కణ్ణుంచి పారిపోదామనిపించింది. గుమ్మందాకా వెళ్ళి గిరుక్కున వెనక్కితిరిగివచ్చి మంచంమీద వాలాడు. ఇంతదూరంవచ్చి తిరిగి వెళ్ళిపోవటమా పిరికిపందలాగా?

రమ తిరిగివచ్చేసరికి పొద్దువాలింది. "బడలికతీరిందా?" అని నవ్వుతూ పలకరించింది. "ఆ తీరింది. నీకు ఇప్పటికి తీరుబాటు అయింది కాబోలు!" అని సాధింపుగా అన్నాడు శర్మ.

మీ రీ పూటయినా భోజనం చేస్తారా? లేకపోతే నేను చచ్చిపోయినంత ఒట్టు. పోనీ నేనువండితే పనికిరాకపోతే మీరే వంటచేసుకుందురుగాని..."

"ఛా, అదేమిటి? నీచేతివంట తింటే దేవతలుకూడా తరిస్తారు" అన్నాడు శర్మ నవ్వుతూ.

"భోజనానికేంగాని—నీకీ అడవిలో ఎల్లా తోస్తోంది రమా? దారిదొరికిందని రాశావు. ఇదేనా? ఇక్కడ నీకు ఆనందంగా వుందా?" అని అడిగాడు శర్మ. "ఈ అమాయక హృదయాల్లో నాకు స్వర్గమే దొరికినంత ఆనందంగా వుంది" అంటూ పొయ్యి రాజెయ్యటానికి వెళ్ళింది రమ.

శర్మ లేచి వాగులో స్నానానికి బయలుదేరి కొండలూ, తోటలూ తిరగేసి చీకటివడ్డాక గుడిసెకి తిరిగివచ్చాడు. వచ్చే సరికి రమ గుడిసెదగ్గర గొల్లగూడెం అంతా మూగింది. తీయనికంఠంతో వాళ్ళకి పురాణం వినిపిస్తోంది రమ. కామిని ఒక్కసారిగా యోగిని అయిపోయిందే అని వెటకారంగా శర్మ నవ్వుకున్నాడు. ఆ మసక వెలుగులో, నీలాకాశంకింద రమ లావణ్యం దివ్యస్వప్నంలాగా వుంది. మత్తెక్కించే మద్యం లాగా వుంది శర్మకళ్ళకి రమ రూపం. ఆ చీకట్లో రమ కంట పడకుండా వచ్చినదారిని వెళ్ళిపోవాలని శర్మ బ్రహ్మప్రయత్నం చేశాడు. లేచి రెండడుగులు సాగేసరికి రమ పురాణంముగించి "ఇంకా గురువుగారు రాలేదు. దారి తప్పారేమో! కాస్త ఎదురువెళ్ళండి" అనటం వినిపించింది. పొద చాటునించి శర్మ ముందుకివచ్చి వెతకటానికి బయలుదేరిన గొల్లల దీపాలవెలు

(3)

గులో చిక్కుకున్నాడు. రమ గుడిసెకేసి బరువుగా అడుగులు వేశాడు.

కడుపునిండా భోజనంచేసి శర్మ మంచంమీద వాలాడు.

పని అంతా ముగించుకుని వచ్చిన రమ అతని కాళ్ళ వైపున ఒక ఈతాకులచాపపరుచుకుంది.

నిద్రపోతున్నట్లు నటిస్తూ శర్మ కళ్ళుమూసుకున్నాడు. దీపం తగ్గించి వచ్చి తనకాళ్ళని కళ్ళకద్దుకుని "మీ మేలు జన్మ జన్మలకీ మరిచిపోలేను" అంటూ వెళ్ళి చాపమీదవాలింది. కణ కణమండే ఇనపకడ్డీతో చుర్రున వాత వేసినట్లుగా శర్మ చెప్ప లేనిబాధతో తల్లడిల్లిపోయాడు.

గజగజవణికిస్తూ ఒకటే చలిగాలి. గుడిసె అంతటినీ దేదీ ప్యంగా వెలిగిస్తూ లోపలికి తొంగిచూసే వెండివెన్నెల.

ఎంతోసేపు ఏవో కీర్తనలుపాడుకుని రమనిద్రపోయింది. ఆ నిశ్శబ్దంలో ఆమె నిశ్వాసంకూడా నిద్రరాని శర్మచెవుల్లో మోగుతోంది. ఆమెకేసి చూస్తుంటే శర్మరక్తం భగ్గు మంటోంది. ఆ సౌందర్యం మహాజ్వాలగా అతన్ని చుట్టేసి నిలువునా దహించివేస్తోంది.

* * *

ఒంటిమీద ఏదో పాము ప్రాకుతున్నట్లుగా ఉలిక్కిపడి లేచింది రమ. కేక వెయ్యబోతున్న ఆమెనోటిని నొక్కుతున్న చెయ్యి విదిలించేసి చివాలున లేచి నిలబడింది రమ. దీపం పెద్దదిచేసింది. శర్మ వంచినతల ఎత్తలేకపోయాడు.

"మీరా ? మీరేనా ?" అని వణికిపోతూ రమ అడిగింది.

అవునని శర్మ తలవూపాడు.

"రక్షించిన మీరే నన్ను భక్షిస్తారా? నన్ను సృష్టించిన మీరే నన్ను సర్వనాశనం చేస్తారా ? మిమ్మల్ని గురువుగా పూజిస్తున్నాను కదా ! ఇది మీకు ధర్మమేనా ?" అని ఉద్వేగంతో అరచింది రమ.

"తొందరపడకు రమా! నేను గురువునికాను. నేనూ అందరిలాంటిమనిషినే. అందరిలాగే నేనూ కోరికలకిబానిసనే."

"ఛీ, ఈ మాటలు మీనోట వినలేను నేను. గురుపీఠం లోంచి మీరు దిగజారిపోవటం చూసి నేను భరించలేను" అంది రమ ఉద్రేకంతో.

"రమా ! నామాట విను. నీకాళ్ళు పుచ్చుకుని వేడుకుంటున్నాను. నన్ను రక్షించు. నన్ను దహించేస్తున్న ఈ మంటల్లోంచి నన్ను రక్షించు" అంటూ లేచి రమదగ్గరికి వెళ్ళి గుడిసె గోడకి ఆనుకునినుంచున్న రమని అటు ఇటూ కదలకుండా చేతులతో కట్టివేశాడు.

రమ కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగినయ్.

"ఇంత చదువుకున్నారు. ఈ మాత్రం మిమ్మల్ని మీరు శాసించుకోలేరా ?" అని దీనంగా అంటూ అతనిచేతుల్లోంచి తప్పించుకుంది.

"ఈమంట అన్నిటినీ భస్మంచేసింది. ఇక ఎదురుతిరిగే శక్తి నాకు లేదు. నువ్వు కరుణించకపోతే, నువ్వు నన్ను రక్షించకపోతే ఈజ్వాల నా ప్రాణాన్నికూడా మసిచేసేస్తుంది."

"ఏమిటి మీ రనేది ? నాకేమీ బోధపడడం లేదు" అంది రమ శర్మకేసి వింతగా చూస్తూ.

"రమా! ఇన్నాళ్ళూ నేను అడగటానికి సాహసించలేక పోయాను. నా కోరిక మన్నించు. మనిద్దరం వివాహం చేసుకుందాం. ఇక్కడే సుఖంగా జీవిద్దాం" దీనంగాని అమర పాదాల దగ్గరవాలి అడిగాడు.

"క్షమించండి. నా కలుషిత జీవితంతో మీ జీవితాన్ని కూడా కళంకితం చెయ్యలేను. నన్ను మన్నించండి. మీ మనస్సు మరల్చుకోండి" అని శర్మ తలని చేతివేళ్ళతో సవరిస్తూ, "లేవండి. నీకన్నీళ్ళని నేను చూడలేను" అంది.

"రక్షించవా రమా ? ఈ కారుచిచ్చుని చల్లార్చవా రమా?"

"నన్నేం చెయ్యమంటారు ?" అని ఆందోళనగా అడిగింది రమ.

"నువ్వు రగిలించిన జ్వాలని నువ్వే చల్లార్చగలవు"అని శర్మ రమ దారికి అడ్డంగా నిలబడ్డాడు.

"నిజమే! అయితే ఒక్క నిమిషం ఆగండి. అలంకరించుకుని వస్తాను" అంటూ రమ అతనిముందునుంచి తూనీగలాగా దూసుకుపోయింది. మెరుపుముఖాల కొరడా ఝుళిపిస్తే బిత్తర పోయినట్లు శర్మ విస్తుపోయి నిలబడ్డాడు.

ఎంతకీ రమ తిరిగిరాలేదు. "ఇంకా పూర్తికాలేదా ఆమె సింగారించుకోటం?" లేచివిసుగెత్తి పిచ్చెక్కినవాడిలాగా శర్మ అటూఇటూ పచార్లుచేశాడు.

ఎక్కణ్ణుంచో ఒక మబ్బు కమ్ముకువచ్చి వెన్నెలంతా మింగేసింది. రమ ఎంతసేపటికి తిరిగిరాలేదు.

వేకువ వెలుగులో వెయ్యికోకిలలు గొంతుచించుకుంటున్నయ్. పూలవాసనలు గుమ్మరిస్తూ గాలులు చెలరేగుతున్నయ్,

గుడిసె గుమ్మంలో అలికిడి వినిపించి శర్మ బైటికి వచ్చాడు. తంబూరాధ్వని అతని గుండెలు నిలువునా చీల్చివేసింది. "ఇదుగో నా అలంకరణ పూర్తిఅయింది" అంటూ కాషాయదుస్తుల్లో, వికృతంగా కత్తిరించిన జుట్టుతో వచ్చింది రమ.

"రమా! నువ్వా?" అంటూ స్తంభించిపోయాడు శర్మ.

"అవును, నేనే. నేనురగిల్చిన అగ్నిని నేనేచల్లార్చాను. ఇక సెలవు మరి, నాకు వెలుగుదారులుచూపిన మీరు చీకట్లో అలమటించటం నేను సహించలేను. వెళ్తున్నాను. సెలవు" అంటూ రమ ఆకుపచ్చ గుబుర్లలో కలసిపోయింది.

పిడుగుదెబ్బ తిన్నవాడిలాగా శర్మ అక్కణ్ణుంచి కదల్లేకపోయాడు. రమ చేతిలోవున్న తంబూరాధ్వని దూరంనుంచి వినిపిస్తోంది. అది శర్మ హృదయస్పందనంలో లీనమై అనుక్షణమూ ప్రతిధ్వనిస్తున్నట్లే అనిపిస్తోంది!

---